క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలోకి మాజీ కౌన్సిలర్



వైఎస్సార్ సీపీలోకి పల్లా సూరిబాబును ఆహ్వానిస్తున్న ఎంపీ సుభాష్ చంద్రబోస్

రామచంద్రపురం: పట్టణంలోని టీడీపీ మాజీ కౌన్సిలర్ పల్లా సూరిబాబు గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సూరిబాబుకు ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, పార్టీ నేతలు అగ్రో సూరిబాబు, మల్లిడి సత్తిరెడ్డి, సత్తి శంకర్‌రెడ్డి, వేల్పూరి రాంబాబు, కుడిపూడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తోటకు మద్దతుగా ప్రచారం



కోరుమిల్లి ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ తోట కుమార్తె, కోడలు

కపిలేశ్వరపురం: కోరుమిల్లిలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులుకు మద్దతుగా ఆయన కుమార్తె కొట్టు శ్రీలక్ష్మి, కోడలు ప్రత్యూష ఎన్నికల ప్రచారం చేశారు. గ్రామ వీధుల్లో పర్యటిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వెయ్యాలని అభ్యర్థించారు. నిరంతరం ప్రజల మధ్య ఉండే తన తండ్రిని గెలిపించాలని శ్రీలక్ష్మి కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్‌మన్ సస్పెండ్

మలికిపురం: చింతలమోరి గ్రామంలో విద్యుత్ లైన్‌మన్ సీహెచ్.వెంకట్రావును ఉన్నతాధికారులు ఉద్యోగం నుంచి సస్పెండ్ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులు అందినట్టు ఏపీఈపీడీసీఎల్ రాజోలు ఏడీఈ సీహెచ్ శ్రీనివాసరావు, ఏఈ మద్దూరి సతీష్ బుధవారం ధ్రువీకరించారు. గ్రామంలో కొల్లు డాల్‌రాజు అనే వినియోగదారుడు తన ఇంటి విద్యుత్ బిల్లు అధికంగా వస్తుందని లైన్‌మన్ వెంకట్రావుకు ఫిర్యాదు చేశారు. అతని వద్ద రూ.3 వేలు తీసుకున్న వెంకట్రావు.. బిల్లు ఎక్కువ రాకుండా విద్యుత్ మీటరును సీల్ చేశాడు. అయినా మరుసటి నెల బిల్లు అధికంగా రావడంతో డాల్ రాజు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనితో పాటు గ్రామంలో రొయ్యల చెరువుకు అక్రమ విద్యుత్ ఇస్తున్నాడని కూడా లైన్‌మన్ వెంకట్రావుపై సర్పంచ్ రాపక రమేష్‌బాబు ఫిర్యాదు ఇచ్చారు. ఆయా ఫిర్యాదులపై విచారణ చేసిన ఉన్నతాధికారులు.. లైన్‌మన్ వెంకట్రావుపై వేటు వేశారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారాలు




సత్కారాలు అందుకున్న వారితో ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు

సఖినేటిపల్లి: మండలంలో పదో తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గురువారం రాత్రి స్థానిక మూడు తూముల సెంటర్‌లో ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు వారిని సన్మానించారు. కవి, రచయిత కత్తిమండ ప్రతాప్, యువ నాయకుడు కుసుమ చింటు సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. విద్యార్థులు చొప్పల సోను, కుసుమ క్రెసెంట్, కుసుమ జోయ్, గెద్దం హన్సిని ఏంజెల్, కుసుమ షిప్రావలి సత్కారాలు అందుకున్నారు.

ఫ్యాన్‌టాస్టిక్‌గా..

- ప్రచారంలో వైఎస్సార్ సీపీ ముందంజ
- అంతటా వీస్తున్న ఫ్యాన్ గాలి
- ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులుకు ప్రజల మద్దతు
- డీలా పడుతున్న టీడీపీ అభ్యర్థి వేగుళ్ల
- కలసి రాని కూటమి పొత్తు



టేకిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల సమస్యలను వింటున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు (ఫైల్)

కపిలేశ్వరపురం: ఎన్నికల పోలింగ్ దగ్గర పడింది.. వైఎస్సార్ సీపీ ప్రచారంలో దూసుకుపోతోంది.. అడుగడుగునా జనం మద్దతు కూడగట్టుకుంది.. ఇక ఫ్యాన్ గాలి జోరందుకుంది.. ప్రజా సంక్షేమాన్ని ప్రతి గడపకూ తీసుకొచ్చిన జగనన్నకే తమ మద్దతు అని ప్రతి నోటి నుంచి వస్తోంది.. నియోజకవర్గం అంతా వైఎస్సార్ సీపీ కుటుంబంలా మారింది.. నడవలేని వృద్ధులైనా, భవిష్యత్తుకు బాటలు వేసుకునే విద్యార్థులైనా, కుటుంబాన్ని నడిపించే అక్కచెల్లెమ్మలైనా ఇలా అందరి మాటా జగనన్నే మా భవిష్యత్తు అని వినిపిస్తోంది.. ఇలా వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు విజయం సునాయాసం అవుతుందని అంతా చర్చించుకుంటున్నారు.

మండపేట నియోజకవర్గంలో ప్రధాన పార్టీల ప్రచారం ఊపందుకుంది. వైఎస్సార్ సీపీ, టీడీపీ అభ్యర్థుల మధ్యే ప్రధానంగా పోటీ ఉంటుంది. ఈ ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చెబుతూ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ముందుకు సాగుతున్నారు. ఆయన కుటుంబ సభ్యులు సైతం గ్రామాల్లో పర్యటిస్తూ జనం మద్దతు కూడగడుతున్నారు. అలాగే టీడీపీ అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు ప్రచారం చేస్తున్నారు. ఎమ్మెల్సీ తోట చేసిన అభివృద్ధిని వివరించి ఆలోచనతో ఓటు వేయమని చెబుతుంటే... టీడీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే వేగుళ్ల మాత్రం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ సాగుతున్నారు. ఎమ్మెల్సీ తోట కేవలం రాజకీయాలకే పరిమితమైన వ్యక్తి. నిరంతరం ప్రజల సమస్యలపై, ప్రభుత్వ నిధులతో గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారిస్తుంటారన్న పేరు ఉంది. టీడీపీ అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు తన వ్యాపార కార్యకలాపాలకు అత్యధిక సమయాన్ని కేటాయిస్తారన్న విమర్శ ఉంది. ఎమ్మెల్యేగా గెలిచాక నాలుగున్నరేళ్ల పాటు వ్యాపారాలు చూసుకుని, చివరి ఆరు నెలలు ప్రజలు, ఎన్నికలకు వచ్చారని ఆలోపణలు ఉన్నాయి.

అదే దూరం పెంచింది..

మొదట్లో టీడీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన అభ్యర్థిగా వేగుళ్ల లీలాకృష్ణలు పోటీ చేసేందుకు తీవ్రమైన ప్రయత్నాలు చేసుకున్నారు. పొత్తులపై పై స్థాయిలో అధినేతలు చర్చలు జరపకుండానే మండపేట బహిరంగ సభలో చంద్రబాబు కూటమి తరఫున టీడీపీ అభ్యర్థిగా వేగుళ్ల జోగేశ్వరరావును మరోసారి ఆదరించండంటూ ప్రకటించారు. ఆ రోజు నుంచి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ ఉమ్మడి కార్యాచరణకు దూరంగా ఉంటూ వచ్చారు. పవన్ కల్యాణ్‌తో చర్చించి తమకు, తమ కార్యకర్తలకు న్యాయం జరిగే వరకూ ఉమ్మడి కార్యాచరణలో పాల్గొనేది లేదంటూ స్వయంగా మీడియా ముఖంగా లీలాకృష్ణ ప్రకటించారు. చిట్ట చివరలో అధినేతలు చర్చించుకుని లీలాకృష్ణ, జోగేశ్వరరావులను కలిసి పని చేస్తున్నారంటూ ప్రకటన చేశారు. వీరిద్దరి మధ్య దీర్ఘకాలం ఐక్యత కొరవడటంతో క్షేత్ర స్థాయిలో ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరి ఎమ్మెల్సీ తోట వెంట నడుస్తున్నారు.



కేశవరంలో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

సమస్య చూసి.. స్పందించి

వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అనేక సమస్యలు పరిష్కరించారు. వాటిని ఒకసారి పరిశీలిస్తే..

కేదారిలంక ఎస్సీ పేట సమీపంలో లోతైన గుంత ఉండేది. ఎన్నిసార్లు ఎంత మంది ఎమ్మెల్యేలకు చెప్పినా పరిష్కరించేవారు కాదు. ఈ విషయం గతంలో తోట దృష్టికి రాగానే రూ.20 లక్షల మండల పరిషత్ గ్రాంటుతో గుంతను పూడ్చించారు. మండపేట హరిజనవాడలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను రూ.10 లక్షలతో ఆధునీకరించారు. పట్టణ ప్రధాన వీధిలో బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్, జ్యోతీరావ్‌పూలే విగ్రహాలను ఏర్పాటు చేశారు. టేకిలో కాపు కమ్యూనిటీ హాల్, అంగరలో వీవర్స్ కమ్యూనిటీ హాల్‌కు నిధులు, టేకి, అంగర గ్రామాల్లో కుంతీదేవి ఆలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. మాచర, తోడుగుడ్లపాడు, నల్లూరు, కేదారిలంక, కాలేరు, అచ్యుతాపురం తదితర గ్రామాల్లో రామాలయాల నిర్మాణాలకు కృషి చేశారు. ఇవి ఆయా గ్రామాల్లో ఓట్లు పడేందుకు సానుకూల అంశాలుగా మారాయి.

అభివృద్ధి కార్యక్రమాలతో సానుకూలం

ఈ ఐదేళ్లలో అపరిష్కృతంగా ఉన్న అనేక సమస్యలు పూర్తయ్యాయి. అవి ఇలా.. మండపేట–ద్వారపూడి రహదారి నిర్మాణాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.25 కోట్లతో పూర్తి చేయించింది. జొన్నాడ– యానాం రహదారి నిర్మాణానికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కృషి చేశారు. మండపేటలో పరిమితంగా ఉన్న 2.5 ఎకరాల డంపింగ్ యార్డును ఆనుకొని అదనంగా 2.75 ఎకరాల స్థలాన్ని సేకరించారు. యాజమాని కోర్టుకు వెళ్లడంతో అనేక ఏళ్లుగా సమస్య ఉంది. ఎమ్మెల్సీ తోట చొరవ చూపి డంపింగ్ యార్డు నిర్మాణ సమస్యను పరిష్కరించారు. పట్టణ 20 వార్డు జగనన్న కాలనీలో రూ.95 లక్షలతో అర్బన్ పీహెచ్‌సీ భవనాన్ని నిర్మించారు. కపిలేశ్వరపురం మండలం తాతపూడి బ్యాంక్ కెనాల్‌పై రూ.20 లక్షలతో కాలిబాట వంతెన వచ్చింది. కోరుమిల్లికి శ్మశాన వాటిక లేకపోవడంతో రూ.15 లక్షలను తొలి విడతగా మంజూరు చేయించారు. కపిలేశ్వరపురం, కోరుమిల్లి తదితర గ్రామాల్లో వాటర్ ట్యాంకుల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. పడమర ఖండ్రిక గ్రామంలో ఉయ్యాల జంపాల దైవ క్షేత్రాన్ని దర్శించుకోవడానికి వచ్చినప్పుడు రహదారి అధ్వానంగా ఉండటాన్ని చూసి వెంటనే సుమారు రూ.20 లక్షలతో నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. మండపేట మండలం కేశవరంలోని కుర్రావారిమెట్టలో టీడీపీ హయాంలో సుమారు 300 మందికి ఇళ్ల పట్టాలిచ్చారు. వారికి స్థలాన్ని చూపించలేకపోవడంతో ఎమ్మెల్సీ తోటను ఆశ్రయించారు. వెంటనే స్పందించిన ఆయన వారితో పాటు మరింత మందికి పట్టాలను ఇచ్చి సంబంధిత స్థలాన్ని చదును చేయించి లేఅవుట్ నిర్మాణానికి పూనుకున్నారు. రాయవరం మండలం మాచవరం దేవుడి కాలనీకి వంతెన ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు. వి.సావరంలో కాలనీకి రహదారులు, డ్రైన్ల వ్యవస్థ కల్పించారు. అదే గ్రామంలో ఎస్సీ, బీసీ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించారు. వీటిని చూసి జనం వైఎస్సార్ సీపీకే పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారు.

అప్పుడిలా ఆదుకుంటూ..

ఎమ్మెల్సీ తోటకు కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లి, మాచర, టేకి, నాగులచెరువు, వాకతిప్ప అద్దంకివారిలంక గ్రామాలతో అనుబంధం ఉంది. ఆయన్ని కోరుమిల్లి వాసులు పదవిలో ఉన్నా లేకపోయినా ఎమ్మెల్యేగారనే పిలుస్తుంటారు. నియోజకవర్గాల పునర్విభజనకు ముందు ఆయా గ్రామాలు రామచంద్రపురం నియోజకవర్గంలో ఉండేవి. ఇప్పుడు మండపేట నియోజకవర్గంలో ఉండటంతో ఈయనకు మరింత బలం పెరిగింది. ఇదే ఎన్నికల్లో తోట విజయానికి దోహదపడుతుందని అంతా చర్చించుకుంటున్నారు.

సీఎం జగన్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాలకూ మేలు



20వ వార్డులో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న చైర్‌పర్సన్ దుర్గారాణి, కార్యకర్తలు



ఎమ్మెల్సీ త్రిమూర్తులుకు మద్దతుగా ప్రచారం చేస్తున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి గీత

మున్సిపల్ చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: నియోజకవర్గంలో 3.50 లక్షల మందికి వివిధ సంక్షేమ పథకాలు అందాయని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు మేలు జరిగిందని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. గురువారం స్థానిక 20వ వార్డు గొల్లపుంత కాలనీతో పాటు పట్టణంలోని పలు వార్డుల్లో ఆమె ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓట్లు కూడా వేసి ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావులను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా దుర్గారాణి మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు ఆటంకం లేకుండా అమలవుతాయన్నారు. టీడీపీ నాయకుల మోసపూరిత వాగ్దానాలు నమ్మవద్దని పిలుపునిచ్చారు. పార్టీ పట్టణ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, ఏఎంసీ డైరెక్టర్ షేక్ మస్తాన్, పిల్లి శివ, గనిపే నాగభూషణం, కాకాడ నూకరాజు, కొమ్మోజు నాగేశ్వరరావు, సేనపతుల దొరబాబు, సదరవు ప్రసాద్, యాదిగని చంటి, గాజుల శ్రీను, పేరూరు మాధవి తదితరులు పాల్గొన్నారు.

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును గెలిపించుకుంటే నియోజకవర్గం అభివృద్ధి పథాన పయనిస్తుందని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవరపల్లి గీత అన్నారు. స్థానిక 11వ వార్డులో ఆ వార్డు ఇన్‌చార్జి కనికెళ్ల పల్లవిప్రసాద్, పార్టీ టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి గీత పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వార్డు నాయకులు సన్నాల ధనరాజు, కనికెళ్ల ప్రసాద్, కోనాల బోస్, విప్పర్తి సింహాచలం, సాధనాల శివ, వారా రవి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, బీసీలకు ‘వేగుళ్ల’ చేసిందేమీ లేదు



ఏడిద సీతానగరంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు



నదురుబాదలో ప్రచారం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

మండపేట: ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు నియోజకవర్గంలో ఎస్సీ, బీసీలకు చేసిందేమీ లేదని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లూరి రామకృష్ణ, బీసీ ఐక్య కార్యాచరణ సమితి జిల్లా కార్యదర్శి మేడిశెట్టి సూర్యభాస్కరరావు అన్నారు. వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం వారు సర్పంచ్ వరదా చక్రవర్తితో కలసి ఏడిద సీతానగరంలో పర్యటించారు. ఈ గ్రామంలోని ఉపాధి కూలీలను కలసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తోట త్రిమూర్తులును గెలిపించాలని కోరారు. వేగుళ్ల తన పదవీ కాలంలో దళితులు, బడుగు బలహీన వర్గాలను అణగదొక్కారన్నారు. త్రిమూర్తులును గెలిపించుకుంటే అన్ని వర్గాలకు అండగా ఉంటారన్నారు. ప్రచారంలో ఎంపీటీసీ అడ్డాల శ్రీదేవీరామరాజు, వేగిరాజు సురేష్‌రాజు పాల్గొన్నారు.

నదురుబాదలో ప్రచారం

రాయవరం: మండపేట వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు మద్దతుగా మండలంలోని నదురుబాదలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. అసెంబ్లీ అభ్యర్థిగా తోట త్రిమూర్తులు, ఎంపీ అభ్యర్థిగా రాపాక వరప్రసాదరావులను గెలిపించాలని శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఉప సర్పంచ్ మిర్తిపాటి సత్యనారాయణ, నాయకులు నల్లమిల్లి వెంకటరెడ్డి, సబ్బరపు వెంకటరమణ, ఓదూరి సుబ్రహ్మణ్యం, మాకన రాంపండు, చోడె దుర్గాప్రసాద్, వల్లు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

జనమంతా వైఎస్సార్ సీపీ వైపే..

- మళ్లీ వచ్చేది జగనన్న ప్రభుత్వమే
- మండపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులు



కేశవరంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు

మండపేట: జగనమంతా వైఎస్సార్ సీపీ వైపే ఉన్నారని, మళ్లీ వచ్చేది జగనన్న పాలనే అని మండపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులు అన్నారు. గురువారం కేశవరంలో సర్పంచ్ పెదపాటి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, తదితరులతో కలసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ తన జీవితం ప్రజాసేవకే అంకితమని, నిరంతరం అందుబాటులో ఉంటూ అన్నివర్గాల ప్రజల సమస్యలు పరిష్కరిస్తానని స్పష్టం చేశారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఈ ఐదేళ్లు నిర్విరామంగా సంక్షేమ పథకాలు అందించిన సీఎం జగన్ ప్రజల మనసులో సుస్థిర స్థానం సంపాదించారన్నారు. రాష్ట్రంలో మరింత సంక్షేమం వెల్లివిరియాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసుకోవాలన్నారు. మండపేట నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించాలన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలన్నారు. అలాగే ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావును కూడా గెలిపించాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధిని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఎప్పుడూ పట్టించుకోలేదన్నారు. ఈ ఐదేళ్లు అతని వ్యాపార సామ్రాజ్యాన్ని మాత్రమే విస్తరించుకున్నారని ఆరోపించారు. అంతకుముందు కేశవరం రైల్వే గేట్ నుంచి మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. ఆ గ్రామ ప్రధాన వీధుల్లో జరిగిన ఈ ర్యాలీకి కేశవరానికి చెందిన వందలాది మంది యువత ఉత్సాహంగా తరలివచ్చారు. నాయకులు తుపాకుల ప్రసన్నకుమార్, కొప్పిరెడ్డి ప్రసాద్, ఎంపీటీసీ, వార్డు సభ్యులు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికే మరోసారి పట్టం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందాయని ఆ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు స్పష్టం చేశారు. ఐదేళ్లుగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందించిన సీఎం జగన్‌కే మళ్లీ ప్రజలు పట్టం కడతారని అన్నారు. ఏడిదలో ఎన్నికల ప్రచారాన్ని సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి భవానీ రాంబాబు, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబుతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా తోట మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్‌గా ఉందన్నారు. ఈ ఐదేళ్లు కనీవినీ ఎరుగని రీతిలో సంక్షేమ ఫలాలు అందుకున్న ప్రజలంతా మరోసారి జగన్‌ను సీఎం చేయాలనే కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును మూడు సార్లు గెలిపిస్తే ఏం చేశారో చూశారని, తనకు అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పలివెల సుధాకర్, వల్లూరి రామకృష్ణ, మేడిశెట్టి సూర్యభాస్కరరావు, పట్నాల నాగబాబు, రామిశెట్టి శ్రీహరిబాబు, తాతపూడి ఉషారాజేష్, వాసిరెడ్డి అర్జున్, చొల్లంగి రామారావు, చంద్ర శ్రీనివాస్, బూరిగ జానీ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతో చేనేత జీవితాల్లో వెలుగులు



ద్రాక్షారామలో ప్రచారం చేస్తున్న రవీంద్రనాథ్, పార్టీ నాయకులు



ఆదివారపుపేటలో చేనేత కుటుంబాలను ఓట్లు అభ్యర్థిస్తున్న పిల్లి దివ్యశ్రీ



కాజులూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రామచంద్రపురం రూరల్: చేనేత జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తోడుగా నిలవాలని రామచంద్రపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ సతీమణి దివ్యశ్రీ చేనేత కుటుంబాలను కోరారు. ఆదివారపుపేటలో ఆమె గురువారం విస్తృతంగా పర్యటించారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు చేనేతలను తీవ్ర నిర్లక్ష్యం చేశారన్నారు. ఇప్పుడు అన్ని వర్గాలకు మేలు చేసిన వైఎస్సార్ సీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి తన భర్త సూర్యప్రకాశ్‌ను ఎమ్మెల్యేగా, రాపాక వరప్రసాద్‌ను ఎంపీగా గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఎంపీపీ అంబటి భవాని, మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, ఎంపీటీసీ బళ్ల సుధాకరరావు, సర్పంచ్‌లు యల్లమిల్లి సతీష్‌కుమారి, కట్టా గోవిందు, చేనేత నాయకులు ఉప్పు అర్ధనారీశ్వర బులిరాజు, అల్లక బుజ్జి, అల్లక భాస్కరరావు, గుత్తి శ్రీనివాస్, మద్దా ఏడుకొండలు, ఇనుమర్తి సూరిబాబు, లక్కింశెట్టి బాబీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం

నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్‌కు మద్దతుగా ఆయన సోదరుడు, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ పెద్ద కుమారుడు పిల్లి రవీంద్రనాథ్ ద్రాక్షారామలో ప్రచారం చేశారు. ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, నాయకులు కర్రి అబ్బు, కొసనా కామేశ్వరరావు, మహ్మద్ గౌస్, మాకం శివ, నున్న చిన్న, పిల్లి శ్రీనివాస్, కొర్ల బాబీ తదితరుల ఆధ్వర్యంలో రవీంద్రనాథ్ ఇంటింటికీ వెళ్లి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, తన తమ్ముడు సూర్యప్రకాశ్, రాపాక వరప్రసాద్‌లకు ఓట్లు వేసి ఎమ్మెల్యే, ఎంపీలుగా గెలిపించాలని కోరారు. వార్డు సభ్యులు యండమూరి ఈశ్వరరావు, దేగల వెంకటరమణ, నున్న కల్యాణ్, సాక్షి పద్మనాభం, వక్ఫ్ బోర్డు జిల్లా కార్యదర్శి జాఫర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నమ్మించి మోసం చేయడం చంద్రబాబు నైజం

కాజులూరు: నమ్మించి మోసం చేయడం టీడీపీ అధినేత చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని వైస్ ఎంపీపీ రేఖాడి విజయ అన్నారు. కాజులూరు శివారు అగ్నికుల క్షత్రియులపేటలో ఆమె ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో సుమారు 600 వరకూ హామీలిచ్చి ఏ ఒక్కటీ చంద్రబాబు అమలు చేయలేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్రలో ప్రజల సమస్యలను చూసి అధికారంలోకి వచ్చిన వెంటనే నవరత్న పథకాలను ప్రకటించారన్నారు. సీఎం జగన్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి చరిత్ర లిఖించారన్నారు. నాయకులు రేఖాడి ఆదినారాయణ, ఎ.ధర్మారావు, ఆర్.వెంకటేశ్వర్లు, ఆర్.శ్రీను, ఆర్.నరసింహమూర్తి, లోవరాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ షురూ..



ఓటరు స్లిప్పులు పంచుతున్న బూత్ లెవల్ సిబ్బంది

రాయవరం: ఈ నెల13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లలో అధికారులు తనమునలయ్యారు. ఎన్నికలను సక్రమంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా ఇప్పటికే ఎన్నికల విధులు నిర్వహించనున్న పోలింగ్ అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇవ్వగా, పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనపై కూడా దృష్టి సారించారు. అలాగే ఓటర్లకు పోలింగ్ కేంద్రాల సమాచారంతో కూడిన ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి చేసేలా కార్యాచరణ చేపట్టారు. ఇంటింటికీ ఓటరు వివరాలతో కూడిన ఓటరు స్లిప్పులను పంపిణీ చేసే బాధ్యతను పోలింగ్ బూత్ అధికారులకు అప్పగించారు. పోలింగ్ కేంద్రాల వారీగా బూత్ లెవెల్ అధికారులు ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్నారు. ఓటరు స్లిప్పుల పంపిణీని రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

సులువుగా చేరుకునేందుకు..

పోలింగ్ కేంద్రానికి సంబంధిత ఓటరు సులువుగా చేరుకోవడానికి వీలుగా ఓటరు స్లిప్పుపై దారి చూపించేలా గూగుల్ మ్యాప్‌ను ముద్రించారు. పోలింగ్ బూత్ పరిధిలో నివసించే వారికి అడ్రస్ మారినా, ఇతర చోట నుంచి పోలింగ్ కేంద్రానికి ఓటు వేయడానికి వచ్చేవారికి పోలింగ్ కేంద్రం గుర్తుపట్టేందుకు వీలుగా గూగుల్ మ్యాప్ సహాయపడుతుంది. పోలింగ్ కేంద్రానికి సంబంధించిన వివరాలను తెలుసుకోవడానికి బూత్ లెవెల్ అధికారి పేరు, మొబైల్ నెంబర్ ముద్రించారు. ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ జరుగుతుందని, ఓటరు తెలుసుకోవాల్సిన నిబంధనలు కూడా ఓటరు స్లిప్పులో వివరించారు. ఓటరు స్లిప్పుతో పాటు ఎన్నికల సంఘం పేర్కొన్న 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి తీసుకురావాలని సూచించారు.

కేంద్రాల్లోనే బీఎల్వోలు..

పోలింగ్ తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఓటరు స్లిప్పులను అందించి సంతకాలు తీసుకుంటున్నారు. వీరు వెళ్లే సమయంలో ఓటర్లు అందుబాటులో లేకుంటే పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రంలోనే బీఎల్వోలు అందుబాటులో ఉంటారు. అక్కడ కూడా ఓటరు గుర్తింపు కార్డు చూపించి ఓటరు స్లిప్పులను పొందే వీలుంటుంది. ఓటరు జాబితాలో పేరు ఉంటే ఓటు వేసేందుకు అనుమతిస్తారు.

జగన్‌తోనే బీసీలకు రాజ్యాధికారం

ఆత్మీయ సమావేశంలో బీసీ నేతలు



బీసీల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న రాపాక వరప్రసాదరావు

అయినవిల్లి: బీసీలకు రాజ్యాధికారం ఇచ్చింది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయన రుణం బీసీలు ఓట్లు వేసి తీర్చుకోవాల్సిన అవసరం ఉందని పలువురు వైఎస్సార్ సీపీ బీసీ నాయకులు అన్నారు. తొత్తరమూడిలో గురువారం బీసీల ఆత్మీయ సమావేశం అంకం వీర్రాజు అధ్యతన జరిగింది. ముఖ్య అతిథులుగా అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలను టీడీపీ అధినేత చంద్రబాబు అణగదొక్కారని మండిపడ్డారు. ఏనాడూ బీసీల ఉన్నతిని పట్టించుకోలేదన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో బీసీలకు అత్యంత ప్రాధాన్యం కల్పించారన్నారు. రాజ్యాధికారం దిశగా బీసీలను ఏకతాటిపై నడిపిస్తున్నారన్నారు. ఇప్పుడు చంద్రబాబు బీసీల ఓట్ల కోసం మొసలి కన్నీరు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. బీసీలకు అగ్రతాంబూలం ఇచ్చామని అబద్ధపు ప్రచారం చేస్తున్నారన్నారు. జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ నాయకులు వాసంశెట్టి తాతాజీ, కుడుపూడి రామకృష్ణ, మట్టపర్తి వెంకటరమణ, మేడిశెట్టి శ్రీను, పోతబత్తుల అంజనేయులు, సత్తిబాబు, రామారావు తదితరులు పాల్గొన్నారు.